కల్యాణం..కమనీయం

ఘనంగా ఫణిగిరి లక్ష్మీ నర్సింహ స్వామి కల్యాణ వేడుకలు

ఎల్బీనగర్ , మే 23: చైతన్యపురి ఫణిగిరి కాలనీలో మూసీ నది పక్కన కొసగుండ్లపై స్వయంభువుగా వెలసిన శ్రీ ఫణిగిరి కొస గుండ్ల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో గురువారం స్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. యాదగిరిగుట్ట దత్తత ఆలయమైన శ్రీ ఫణిగిరి కొసగుండ్ల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం, మండపంలో స్వామి వారి కల్యాణ వేడుకలను అర్చకులు ఆనంద్ ఆచార్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుందూరు కృష్ణా రెడ్డితో పాటుగా వందలాది మంది దంపతులు స్వామి వారి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త , మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్ గౌడ్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుందూరు కృష్ణారెడ్డి, ప్రతినిధులు ప్రభు, నరేందర్‌రెడ్డి, సుధాకర్ గుప్త, అశోక్, రాకేశ్, రాంమోహన్, రాజు, కనకరాజు, గోవర్ధన్, శ్రీనివాస్ యాదవ్, నర్సింహారెడ్డి , బాలు, రాజేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట నుంచి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు..

కల్యాణ వేడుకల కోసం ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడంతో పాటుగా భక్తుల కోసం చలువ పందిళ్లను వేశారు. ఆలయంలో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఉదయం పదకొండు గంటలకు శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి కల్యాణ వేడుకలు ప్రారంభం కాగా, మధ్యాహ్నం వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణం కోసం యాదగిరి గుట్ట నుంచి ఏఈఓ శ్రవణ్ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కల్యాణ వేడుకల్లో భాగంగా కన్యదాతగా కొసగుండ్ల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ అభివృద్ధికి పాటు పడుతున్న కర్నాటి పద్మావతి, శ్రీనివాస్ దంపతులు వ్యవహరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మాజీ కార్పొరేటర్, పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. స్వామి వారి కల్యాణ వేడుకలతో కొసగుండ్ల పుణ్యక్షేత్రం శోభాయమానంగా, పెద్ద ఎత్తున భక్తులతో కళకళలాడింది.

కొసగుండ్ల లక్ష్మీ నర్సింహ స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, మే 23 : ఫణిగిరి కాలనీ, మోహన్‌నగర్, బ్యాంక్ కాలనీ, యాదవనగర్, చాణిక్యపురి, సౌత్‌ఎండ్‌పార్కు, మదర్‌డెయిరీ, గౌరెల్లి, పసుమాముల, శివాలయం, న్యూ నాగోల్, శివపురి, గ్రీన్‌హిల్స్ కాలనీ, రాజీవ్‌స్వగృహ, హుడాసాయినగర్ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్, మే 23 : వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సమత కాలేజ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకు, 11కేవీ వెంకట్రాదినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు, 11కేవీ మున్సిపల్ సీ-క్వార్టర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

కందుకూరు, మే 23 : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మండల సీనియర్ నాయకుడు, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు సామ మహేందర్‌రెడ్డితో కలిసి పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కాలని చూస్తుందని అన్నారు. ప్రజల పక్షాన ఉంటూ ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. హామీలను అమలు చేసే వరకు పోరాటం చేయాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కావాలని కొంత మంది పార్టీ మారిన ప్రజలు మనవెంటే ఉన్నారని వివరించారు.ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. అధైర్యపడవద్దని ఉద్యమ నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ మనవెంటే ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

2న సహారాస్టేట్స్‌కాలనీ ఎన్నికలు

నామినేషన్ దాఖలు చేస్తున్న వెంకటాద్రి ప్యానెల్ సభ్యులు

నామినేషన్ దాఖలు చేస్తున్న కరణం శ్రీకాంత్ ప్యానెల్ సభ్యులు

మన్సూరాబాద్, మే 23: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలో ఎన్నికల కోలాహలం నెలకొంది. సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీని ఎన్నుకునేందుకు జూన్ 2న ఎన్నికలు నిర్వహించనున్నారు. నూతన కమిటీని ఎన్నుకునేందుకు 1002 వేల మంది కాలనీవాసులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నామినేషన్లకు శుక్రవారం చివరి రోజు కావడంతో వెంకటాద్రి ప్యానెల్ నుంచి సయ్యద్ జానీ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి, కరణం శ్రీకాంత్ ప్యానెల్ నుంచి అధ్యక్షుడిగా కరణం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్ పోటీ పడుతున్నారు. కమిటీలో మొత్తం 21 స్థానాలకు గాను ఎన్నికలు జరుగుతున్నాయి. వెంకటాద్రి ప్యానెల్ నుంచి, కరణం శ్రీకాంత్ ప్యానెల్ నుంచి 21 మంది తమ నామినేషన్లను గురువారం ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఎన్నికల అధికారులుగా నరేందర్‌రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, సాయిరాం, సురేందర్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇరు ప్యానెళ్లకు చెందిన అభ్యర్థులు వారి మద్దతుదారులు సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు ఇరు ప్యానెళ్లకు చెందిన అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఫేషియల్ సర్జరీ

వనస్థలిపురం, మే 23 : ప్రమాదవశాత్తు కిందపడి ముఖం ఎముకలు విరిగిపోయిన ఓ కార్మికుడికి వనస్థలి హాస్పటల్ వైద్యులు ఉచితంగా ఫేషియల్ సర్జరీ చేశారు. ఎల్బీనగర్‌కు చెందిన రబీబుల్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనిచేస్తున్న సమయంలో కిందపడి ముఖం ఎముకలు విరిగాయి. దీంతో వనస్థలిపురంలోని వనస్థలి హాస్పిటల్‌లో ప్రముఖ ఫేషియల్ సర్జన్ డాక్టర్ చింతపల్లి సందీప్‌రెడ్డి బృందం ఆపరేషన్ చేశారు. ముఖం, మెడకు సంబంధించిన ఎలాంటి సమస్యలనైనా తాము విజయవంతంగా నయం చేస్తామని తెలిపారు. వైద్యులు డాక్టర్ క్రిష్ణారెడ్డి, డాక్టర్ అనుషా రెడ్డి, హాస్పిటల్ నిర్వాహకుడు కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవి సన్నిధిలో దర్శకుడు వేణు పూజలు

ఆర్కేపురం, మే 23 : ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని గురువారం బలగం సినిమా దర్శకుడు వేణు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ దంపతులు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ప్రత్యంగిరా అమ్మవారు చాలా శక్తివంతమైన దేవతని, అమ్మవారి మహిమలు ప్రపంచమంతటా వ్యాప్తి చెందాయని తెలిపారు. ఎండు మిరప కాయలతో జరిగే హోమం చాలా మహిమ కలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, అరుణ, సాయికుమార్‌శర్మ, బనగిరి నాగరాజు, హేమంత్, శ్రీపతి, రామశర్మ తదితరులు ఉన్నారు.

వేణుకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న మునిపల్లె శ్రీనివాస్ దంపతులు

డీసీఎం ఢీకొని వృద్ధుడు మృతి

మన్సూరాబాద్, మే 23: అతి వేగంగా వచ్చిన డీసీఎం ఢీ కొట్టిన ఘటనలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వృద్ధుడు గురువారం ఉదయం 7:30 గంటల సమయంలో సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని శ్రీకర హాస్పిటల్ నుంచి ఇయాన్ డిజిటల్ ఎగ్జామ్ సెంటర్ వైపు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో అతి వేగంగా వచ్చిన డీసీఎం వృద్ధుడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు కారకుడైన డీసీఎం డ్రైవర్ హరి ప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రైనేజీ మెయిన్ లైన్‌కు మరమ్మతులు

మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్

ఆర్కేపురం, మే 23 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ముందు వరసలో ఉంటారని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ అన్నారు. ఆర్కేపురం డివిజన్ జనప్రియగార్డెన్స్ కాలనీ పార్కు వద్ద ప్రధాన రోడ్డులో డ్రైనేజీ మెయిన్ లైన్ చంబర్ కూలిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బుధవారం సంబంధింత శాఖ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులు డ్రైనేజీ మెయిన్ లైన్ చంబర్‌కు మరమ్మతులు చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ముకాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలమేరకు అధికారులు పనులు వేగంగా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాజీద్, గొడుగు శ్రీనివాస్, కాలనీ వాసులు పర్వత రెడ్డి, కిషన్‌రావు, భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

సైదాబాద్, మే 23 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి (భక్తసమాజం) ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. గురువారం వైశాఖ మాస పుణ్యతిథి పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించిన సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రత్నాజీ ఆధ్వర్యంలో కొనసాగిన పూజా కార్యక్రమాలకు ఆలయ పరిసర కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ వైఎస్ ఆర్ మూర్తి, సెక్రటరీ సాంబశివశాస్త్రీ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లలోకి మురికి నీరు

అధికారులకు సమస్యను వివరిస్తున్న సహదేవ్ యాదవ్

మాదన్నపేట, మే 23: జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ పనులను నిర్లక్ష్యంగా చేపడుతుండటంతో ఇండ్లలోకి మురికి నీరు వస్తుందని జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన దోభీఘాట్ వద్ద నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలల నుంచి ఈ ప్రాంతంలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులు పగిలి పోవడంతో నూతనంగా పైపులు వేశారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో మురికి నీరు ఇండ్లలోకి వస్తుందని దీంతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు ఏఈ అన్సారీ పాల్గొన్నారు.

ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఓపెన్ నాలా మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మే 23: వర్షా కాలంలో కాలనీల్లో ముంపు సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు నాలాలు, మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిం పజేస్తున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని చౌరస్తాకు వెళ్లే మార్గంలో ఆయిల్ మిల్ వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీ, నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షా కాలంలో లోతట్టు కాలనీల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని.. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యంజాల జగన్, కాసాని అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

మహేశ్వరం బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ ఇన్‌చార్జిగా కార్తీక్‌రెడ్డి

బడంగ్‌పేట్, మే 23 : మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ ఇన్‌చార్జిగా యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గంలో అన్ని స్థాయిల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలతో మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతికి పాటుపడుతానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల తరపున పోరాటం చేస్తానన్నారు. కేసీఆర్, కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి ఆదేశాలను పాటిస్తూ ముందుకెళ్తానని పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు

చంపాపేట, మే23: సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి గురువారం తన అనుచరులతో వెళ్లి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మినిస్టర్ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్త, చీర తిరుమలేశ్, గూడూరు గౌతంరెడ్డి, మేకల రాజశేఖర్‌రెడ్డి, పోలె బాలకృష్ణ, రెడ్ల శివ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,మే 23: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి(30) గురువారం సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఎల్బీనగర్, మే 23: అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ మారుతీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొత్తపేట న్యూ మారుతీనగర్ మారుతీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఉండే శశికళ (69) అస్తమా వ్యాధితో బాధ పడుతుంది. పలు ఆసుపత్రులకు తిరిగినా వ్యాధి నయంకాకపోవడంతో శశికళ మానసికంగా కృంగిపోయింది. ప్రతిరోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లే శశికళ గురువారం ఇంటి నుంచి వాకింగ్ కోసం వెళ్లింది. అయితే గంట తర్వాత అపార్ట్‌మెంట్ పైకి ఎక్కి శశికళ కిందకి దూకింది. తీవ్ర గాయాలకు గురైన శశికళ మరణించింది. ఈ మేరకు అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు భవనంపైకి ఎక్కి చూడగా అక్కడ శశికళ చెప్పులు, పర్సు కనిపించింది. కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్గం రాజేశ్‌కు పురస్కారం

అనాథ విద్యార్థులకు సేవలందిస్తున్నందుకు ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ నిర్వాహకుడు మార్గం రాజేశ్‌కు మాతృదేవోభవ సంస్థ మహానీయుల పురస్కారం- 2024 అందజేశారు. ఈ పురస్కారాన్ని ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ సందీప్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సంపత్ కుమార్, కోక భిక్షం, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

-ఆర్కేపురం, మే 23 :

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం

దేవతామూర్తులను కల్యాణానికి తీసుకువస్తున్న లక్ష్మణ్ ముదిరాజ్ పండితులు రాజుశర్మ భక్తులు

కందుకూరు, మే 23 : మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ పంచాయతీలో ఊట్ల పల్లిలో గల లక్ష్మీ అండల్ సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని కన్నుల పండవగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ నిర్వాహకులు తేరేటి లలిత లక్ష్మణ్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో చండీ ఉపాసకులు రేవల్లి రాజశర్మ పండితులు పూజలు అభిషేకాలు సుదర్శన, శ్రీరుద్ర, ఆంజనేయ హోమాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం దేవుని గుట్టపై కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తేరేటి లక్ష్మణ్ ముదిరాజ్, సాధ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఊటు మహేందర్, ఎంపీటీసీ మల్లేశ్,కిషన్, రవిముదిరాజ్, దయాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి ..

కందుకూరు: పురాతన దేవాలయాలకు భవిష్యత్ ఉందని ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన సర్వసంఘ పరిత్యాగి పురోషోత్తం మహరాజ్ తెలిపారు.మండల పరిధిలోని లేమూరులో గల శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సత్యనారాయణ స్వామి వ్రతాల సందర్భంగా గురువారం దేవాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి కొంచకూరి వెంకటేశ్వర్లు గుప్త, ఆలయ నిర్వాకులు రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ ముదిరాజ్, గూడూరు మధుకర్‌రెడ్డి, బాలక్రిష్ణ, సురేశ్, మహదేవ్ త్రిపాఠి, లోకాంత్ త్రివేది, నవీన్‌రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

హైదరాబాద్ చాంప్ భవేష్ రెడ్డి జోడి విజయం

నేరేడ్‌మెట్, మే 23: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన హైదరాబాద్ జిల్లా చాంపియన్‌షిప్ టోర్నీలో యువ షట్లర్లు భవేష్ రెడ్డి, సాయిష్ జోడి విజేతలుగా నిలిచారు. మే20న మాదాపూర్ లోని గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమిలో అండర్ 13, 15, 17, 19 ఓపెన్ టోర్నీలు నిర్వహించారు. అండర్ 13 బాలుర డబుల్స్ ఫైనల్‌ల్లో భవేష్ రెడ్డి, సాయిష్ ద్వయం 21-14, 21- 19 తో దర్శ్ గోయల్, ధ్రువ్‌సింగ్ జంటపై అద్భుత విజయం సాధించారు. టైటిల్ విజయంలో రాష్ట్ర టోర్నీలకు అర్హతసాధించారు. మొదటి నుంచే అద్భుతంగా ప్రత్యర్థులను చిత్తు చేసి విజయం సాధించారు. అంతకుముందు అండర్ 13 విభాగంలో క్రిషవ్ ద్వయం 21-10,21-16తో భవేష్ రెడ్డిపై అద్భుత విజయం సాధించడంతో భవేష్ సిల్వల్ మెడల్‌ను సరిపెట్టుకున్నాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ వర్ధమాన మహిళా బాక్సర్ నిఖత్ జరీన్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, బ్యాట్ జాయింట్ సెక్రటరి యూవీఎన్ బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కోశాధికారి కే. వంశీధర్, బ్యాట్ ఆఫీస్ సెక్రటరి పీవీఎల్ కుమార్, శారద తదితరులు హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

బహుమతులను అందుకుంటున్న భవేష్ రెడ్డి జోడీ

కారు పార్కింగ్ విషయంలో ఇరుపక్షాల మధ్య ఘర్షణ

మన్సూరాబాద్, మే 23: కారు పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో ఇరుపక్షాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దాడుల విషయంలో ఇరుపక్షాలు చేసిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, కామినేని చౌరస్తా ఫ్లైఓవర్ కింద కొంత కాలంగా కొందరు డ్రైవర్లు తమ అంబులెన్స్‌లను పార్కింగ్ చేస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం కర్మన్‌ఘాట్, సూర్యతేజనగర్‌కు చెందిన బొడ్డ రవితో పాటు మరి కొందరు అంబులెన్స్‌లను కామినేని ఫ్లైఓవర్ కింద పార్కు చేశారు. రోడ్డు పక్కన సెకండ్ హ్యాండ్ కార్లను అమ్మే కార్యాలయం ఉంది. సదరు కార్యాలయానికి చెందిన ఓ వ్యక్తి అంబులెన్స్‌లు పార్కింగ్ చేసిన పక్కన తన కారును పార్క్ చేశాడు. కారును అక్కడి నుంచి తీసివేయాలని అంబులెన్స్ డ్రైవర్లు కోరగా అందుకు సదరు వ్యక్తి నిరాకరించాడు. దీంతో కారులో ఉన్న మరో ముగ్గురు మరి కొందరితో కలిసి అంబులెన్స్ డ్రైవర్లపై దాడికి దిగారు. ఈ ఘటనలో శ్రీను అనే డ్రైవర్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. కాగా కామినేని చౌరస్తా సమీపంలోని యువర్స్ టైమ్ ఫుడ్‌కోర్టు ముందు తమ కారును పార్కింగ్ చేయగా అంబులెన్స్ డ్రైవర్లు అకారణంగా దాడి చేశ